GREATER HYDERABAD MUNICIPAL CORPORATION

NEWS CLIPPINGS

Andhra Bhoomi　　11/SEP 2013

# మరో అంతర్జాతీయ సదస్సుకు నగరం వేదిక

## ఇప్పటి నుంచే ఏర్పాట్లపై సమీక్ష ★ ప్రిన్సిపల్ సెక్రటరీలను కలిసిన మెట్రోపాలిస్ బృందం



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మెట్రోపాలిస్ బృందం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, సెప్టెంబర్ 10: మరో అంతర్జాతీయ సదస్సుకు మహానగరం మరోసారి వేదిక కానుంది. గత సంవత్సరం అక్టోబర్ మాసంలో జీవవైవిధ్య సదస్సుకు వేదికైన నగరం వచ్చే సంవత్సరం అక్టోబర్ 6 నుంచి జరగనున్న మెట్రోపాలిస్ వరల్డ్ కాంగ్రెస్ సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు మెట్రోపాలిస్(పారిస్ ప్రాంతం)కు చెందిన విదేశీ ఉన్నతాధికారుల బృందం మంగళవారం మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు ఎస్.కె. జోషి, అదర్ సిన్హాలను అధికారికంగా కలుసుకుని సదస్సు ఏర్పాట్లను సమీక్షించారు. వచ్చే సంవత్సరం అక్టోబర్ మాసంలో ఆరో తేదీ నుంచి పదో తేదీ వరకు నగరంలో ఈ సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ సదస్సుకు వివిధ దేశాల నుంచి సుమారు రెండువేల మంది ప్రతినిధులు హజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్‌కె.జోషి మాట్లాడుతూ ఈ సదస్సుకు నగరాన్ని ఎంపిక చేయటం, సిటీకి ఓ చక్కటి అవకాశమని ఆయన వ్యాఖ్యానించారు. భారీ ఏర్పాట్లతో సదస్సును నిర్వహించటమే గాక, నగరం తన పేరు ప్రతిష్టలను ప్రపంచానికి చాటుకునే అవకాశం కూడా కల్గుతోందన్నారు. సమావేశం అనంతరం కమిషనర్ ఎం.టి.కృష్ణబాబుతో కలిసి విదేశీ బృందం మేయర్ మాజీద్ హుస్సేన్‌ను కలిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబర్‌లో జీవవైవిధ్య సదస్సు జరిగిన తర్వాత మరో అంతర్జాతీయ సదస్సును నిర్వహణకు నగరాన్ని ఎంపిక చేయటం తనకెంతో గర్వంగా ఉందన్నారు. ఈ సదస్సుకు హజరుకానున్న ప్రపంచ దేశాల ప్రతినిధులను ఆకట్టుకునేందుకు భారీ ఏర్పాట్లు చేస్తామని, ఇందుకు సంబంధించిన పనులను వెంటనే స్థాయీ సంఘం ముందు పెట్టి మంజూరీ తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం కమిషనర్ కృష్ణబాబు మాట్లాడుతూ మెట్రోపాలిస్, మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే జిహెచ్ఎంసిలు ఈ సదస్సుకు సంయుక్త నిర్వహణ బాధ్యతలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా నగరాలకు సంబంధించిన విషయాలైన రవాణా, హౌజింగ్ అవసరాలు, మురికివాడల అభివృద్ధి, నగరాల ముస్తాబు, అభివృద్ధికి వివిధ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, ప్రవేశపెట్టిన పథకాల గురించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.